
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 43.5 కనిష్ఠం 28.5



తూనికలు, కొలతల అధికారుల తనిఖీలు

- తూకం యంత్రాలు సరిగ్గాలేని యజమానులకు జరిమానా

నవీపేట, ఏప్రిల్ 27: మండల కేంద్రంలోని పలు చికెన్, చేపల దుకాణాలతో పాటు కూరగాయల దుకాణాల్లో శనివారం జిల్లా తూనికలు, కొలతల అధికారి ఎండీ.సుజత్ అలీ తనిఖీలు నిర్వహించారు. నాలుగు చికెన్ దుకాణాలలో తూకం యంత్రాలు సరిగాలేని యాజమానులకు 6,500 రూపాయల జరిమానా విధించారు. అక్రమాలకు పాల్పడితేచర్యలు తప్పవని హెచ్చరించారు. వారివెంట రవీందర్‌రావు, సురేందర్‌రావు ఉన్నారు.



- సమన్వయంతో సాగుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి
- ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు, పార్టీ నేతలతో కలిసి ప్రచారం
- హామీలను వివరిస్తూ.. ఓటర్ల మద్దతును కూడగడుతూ..
- ఆరు గ్యారంటీల అమలు, అభివృద్ధి నినాదాలతో ముందుకు



ప్రచారంలో.. దూసుకెళ్తున్న కాంగ్రెస్!



మెండోరాలో కాంగ్రెస్‌కు ఓటేయాలని అభ్యర్థిస్తున్న జీవన్‌రెడ్డి



రెంజర్లలో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరుతున్న జీవన్‌రెడ్డి

నిజామాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ పార్లమెంట్‌లో కాంగ్రెస్ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి ప్రచారంలో దూసుకుపోతున్నారు. అధికార పార్టీ అభ్యర్థిగా ప్రకటించగానే పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో విస్తృత ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో సమన్వయ సమావేశాలు నిర్వహించడంతో పాటు క్యాడర్ ద్వారా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. పోలింగ్ బూత్‌స్థాయి నుంచి నియోజకవర్గ కేంద్రం వరకు సమన్వయం చేసుకుంటు ఓటర్ల మద్దతును కూడగడుతున్నారు. నామినేషన్ ముందురోజే నిజామాబాద్‌లో నిర్వహించిన సీఎం సభ సక్సెస్ కావడంతో మరింత జోష్‌తో ముందుకు వెళ్తున్నారు. బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థుల కన్నా ప్రచారాన్ని ముందుండి కొనసాగిస్తున్నారు. కొత్తగా అధికారంలోకి రావడం ఆరుగ్యారంటీలలో 5 గ్యారంటీలు అమలు చేస్తుండడం, నిజాంషుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తామని సీఎం హామీఇవ్వడం కలిసివస్తుందని భావిస్తున్నారు. గల్ఫ్ కార్మికుల మద్దతు కూడగడుతూ మరింత జోష్‌గా నియోజకవర్గంలో ఆయన ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

కేడర్‌తో పూర్తిస్థాయిలో మమేకం

కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించగానే జీవన్‌రెడ్డి ప్రచారాన్ని మొదలుపెట్టారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచే నియోజకవర్గం నుంచి పోటీకి సిద్ధమైన ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పూర్తిస్థాయిలో ప్రచారంలో నిమగ్నమయ్యారు. అభ్యర్థిగా ప్రకటించకముందే పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కేడర్‌తో మమేకమై అందరినీ కలుపుకుంటూ సమన్వయంతో ప్రచారంలో ముందుకెళ్తున్నారు. ఏఐసీసీ అధికారికంగా అభ్యర్థిత్వాన్ని ప్రకటించగానే మరింత జోష్‌గా కార్యక్రమాలను మొదలుపెట్టారు. నామినేషన్ వేసిన అనంతరం విస్తృతంగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. పార్లమెంట్ ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు వివిధవర్గాలను కలిసి మద్దతును కూడగడుతున్నారు.

అంతా కలిసి కట్టుగా ముందుకు..

సీఎం రేవంత్‌రెడ్డి ఎలాగైనా సీటుగెలవాలని ఆదేశాలు ఇవ్వడంతో పార్లమెంట్ పరిధిలోని నేతలంతా కలిసికట్టుగా పనిచేస్తున్నారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారులు, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, నియోజకవర్గ ఇన్‌చార్జిలు ముత్యాల సునీల్‌రెడ్డి, పి.వినయ్‌రెడ్డి, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జువ్వాడి నర్సింగ్‌రావు, కార్పొరేషన్ చైర్మన్లు మానాల మోహన్‌రెడ్డి, తాహెర్ బిన్ హందాన్, మాజీ విప్ ఈరవత్రి అనిల్, అన్వేష్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గడుగు గంగాధర్, నగేష్‌రెడ్డి, నగర అధ్యక్షులు కేశవేణుతోపాటు ఇతరనేతలు ప్రచారాల్లో పాల్గొంటున్నారు.

కీలకమైన నియోజకవర్గాల్లో ప్రధానమైన నేతలను గుర్తించి గ్రామ, మండలస్థాయిలో బాధ్యతలను అప్పజెప్పి మద్దతును కూడగట్టే ప్రయత్నాలను చేస్తున్నారు. కిందిస్థాయి నుంచి కేడర్ పనిచేసేలా చూడడంతోపాటు మహిళలు, బీడీ కార్మికులు, గల్ఫ్ కార్మికుల కుటుంబాలు, రైతుల మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. రాజకీయంగా పలు పదవులు అనుభవించిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి తనకు ఒక అవకాశం ఇవ్వాలని ఓటర్లకు విజ్ఞప్తిచేస్తూ ముందుకుకెళ్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మరోదఫా మే 1న కొరుట్లలో జరిగే బహిరంగ సభలో పాల్గొననుండడంతో ఆ లోపు ఏడు నియోజకవర్గాల్లో రోడ్‌షోలు, సభలు, సమావేశాల్లో పాల్గొనే విధంగా ఏర్పాట్లను చేసు కున్నారు. సీఎం సభ అనంతరం మరింత ధీటుగా ప్రచారం నిర్వహించేందుకు సిద్ధమవు తున్నారు. నియోజకవర్గంలో బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు ధీటుగానే ప్రచారం కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలో ఉండడంతో తనకు కలిసి వస్తుందని భావిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు కూడా అమలు కావడంతో ఓటర్ల మద్దతు ఉంటుందని భావిస్తూ ప్రచారంసాగిస్తున్నారు. కాంగ్రెస్ హామీలపై ప్రజలకు నమ్మకం ఉందని కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి తెలిపారు.



ముప్కాల్ సభలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

భానుడి భగభగ

- జిల్లావ్యాప్తంగా పెరిగిన ఎండలు
- 45 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు
- 47చోట్ల 40 డిగ్రీలకు పైనే..
- బయటికి వెళ్లేందుకే జంకుతున్న జనం



నగరంలోని కంఠేశ్వర్‌లో నిర్మానుష్యంగా మారిన రోడ్డు

నిజామాబాద్‌అర్బన్, ఏప్రిల్ 27: జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. ఎన్నడూ లేనివిధంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో జిల్లావాసులు ఎండ తీవ్రతకు గురవుతున్నారు. జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సీయస్‌కు చేరువగా నమోదవుతుండటంతో ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారి కర్ఫ్యూను తలపిస్తున్నాయి. ఉదయం 10 దాటితే భానుడు తన ప్రతాపాన్ని చూపుతుండటంతో మధ్యాహ్నం 12అయితే చాలు రోడ్లపై జనాలు కన్పించడం లేదు. అత్యవసరమైతే తప్ప రోడ్లపైకి రావడం లేదు. వేసవి తీవ్రత దృష్ట్యా ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానీయాలు తాగి సేదతీరుతున్నారు. ఇళ్లలో మధ్యాహ్నం ఉక్కపోతతో పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కూలర్లు, ఏసీలు వేసుకుని చల్ల బడుతున్నారు. ఏప్రిల్ చివరి వారంలోనే జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరువగా నమోదవుతుండగా, మే నెలలో ఎండలు మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే జిల్లా ఆరెంజ్ జోన్‌లోకి వచ్చింది. మున్ముందు రెడ్ జోన్‌లోకి వచ్చే అవకాశం లేకపోలేదని నిపుణులు చెబుతున్నారు. వాహనదారులు, పాదచారులు రుమాలు, క్యాప్‌లు, చున్నీలు ధరించి ఎండనుంచి రక్షణ పొందుతున్నారు.

• జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు..

శనివారం సాలూర మండల కేంద్రంలో 44.8 డిగ్రీల సెల్సీయస్‌గా నమోదుకాగా, వర్ని మండలంలోని జాకోరాలో 44.3 డిగ్రీలు, మోపాల్‌లోని మంచిప్పలో 44.2 డిగ్రీలు, నిజామాబాద్ నార్తులో 43.9 డిగ్రీలు, గూపన్‌పల్లిలో 43.9 డిగ్రీలు, మోస్రాలో 43.7 డిగ్రీలు, భీంగల్‌లో 43.7 డిగ్రీలు, డిచ్‌పల్లి మండలం కొరట్‌పల్లిలో 43.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



ఆర్మూర్ రోడ్డుఇలా..

పరిమితికి మించి ప్రయాణం ప్రమాదానికి సంకేతం!





- ఆర్టీసీ బస్సుల్లో మితిమీరి ప్రయాణిస్తున్న ప్యాసింజర్లు
- ఒక్కో బస్సులో 100కు పైగానే..
- బస్సు ఒక పక్కకు వంగుతున్నా పట్టించుకోని వైనం
- గాలికి వదిలేస్తున్న ప్రయాణికుల ప్రాణాలు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 27: జిల్లాలో ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. బస్సులు పరిమితికి మించి ప్రయాణికులతో ప్రయాణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో రద్దీ పెరిగింది. మహాలక్ష్మి పథకం మొదలైన నాటినుంచి మహిళ ప్రయాణికుల సంఖ్య బస్సుల్లో భారీగా పెరిగింది. బస్సులన్నీ మహిళ ప్రయాణికులతో నిండిపోతున్నాయి. నిజామాబాద్ రీజియన్ పరిధిలో బస్సులలో ప్రయాణికుల సంఖ్య ఘననీయంగా పెరిగింది. గత కొద్ది రోజులుగా పెళ్లిల సీజన్ కూడా తోడవడంతో బస్సులన్నీ ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. సీట్ల కోసం ప్రయాణికులు సర్కస్‌ఫీట్లు చేస్తున్నారు. కొన్నిచోట్ల సీట్ల కోసం కొట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. ప్రయాణికుల, కండక్టర్ల గొడవలు సర్వసాధారణమైపోయాయి. గతంలో కండక్టర్లు ప్రయాణికుల మధ్య సత్సంబంధాలు ఉండగా ప్రస్తుతం రోజు ఎక్కడో ఒకచోట గొడవలు జరుగుతున్నాయి. రీజియన్ పరిధిలో సుమారు 600 పైగా బస్సులు ఉన్నాయి. గతంలో వీటి సంఖ్య ఎక్కువగా ఉన్నా కొందరు అద్దె బస్సుల యజమానులు అద్దెబస్సులను అమ్మేసుకోవడంతో బస్సుల సంఖ్య తగ్గింది.ఆర్టీసీ యాజమాన్యం కొత్త బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు రద్దీగానే ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. నూతనంగా బస్సులు రాకపోవడం ప్రయాణికుల రద్దీకి కారణం అవుతోంది.

• ఒక్కో బస్సులో 100కు పైగా ప్రయాణికులు

బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిన అనంతరం బస్సులు ప్రయాణికులతో నిండిపోతున్నాయి. ఒక్కో బస్సులో సుమారు 50 నుంచి 60 మంది ప్రయాణికుల ప్రయాణిం చాల్సి ఉండగా ఒక్కో బస్సులో సుమారు 100 నుంచి 130 మంది వరకు ప్రయాణికులు ప్రయాణాలు సాగిస్తున్నారు. కెపాసిటీకి మించి బస్సుల్లో ప్రయాణం చేయడంతో బస్సులో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. బస్సుకు అదనపు భారం పడడంతో తొందరగానే రిపేర్‌కు వస్తున్నాయి. వందకు పైగా ప్రయాణికులు బస్సులో ప్రయాణిస్తుంటే బస్సు ఒక పక్కకు వంగి ప్రమాదకరంగా మారుతున్నాయి. ఇంత జరుగుతున్నా ఆర్టీసీ అధికారులు, ఆర్టీఏ అధికారులు ఆర్టీసీ బస్సుల వైపు తొంగి చూడడం లేదు. ప్రమాదం జరిగితే మాత్రం పదుల సంఖ్యలో ప్రాణాలు పోయే అవకాశం ఉంది. కొండగట్టు ఘటన కూడా అధికంగా ప్రయాణికులు ప్రయాణించడం వల్లనే జరిగిన ఉదాహరణ కూడా కళ్లకు కనిపించినట్లు ఉంది.

• ప్రయాణికుల ప్రాణాల భద్రతను గాలికి వదిలేస్తున్న అధికారులు

ప్రయాణికుల ప్రాణాల భద్రతను కాపాడాల్సిన ఆర్టీసీ, ఆర్‌టీఏ అధికారులు పట్టించుకోవడం లేదు. ఆర్టీసీ బస్సులలో పరిమితికి మించి ప్రయాణాలు సాగిస్తున్నా చర్యలు తీసుకోవడం లేదు. ప్రమాదం జరిగితే తప్ప చర్యలు తీసుకోరా అంటూ ప్రయాణికులు మండిపడుతున్నారు. ఒక్కో బస్సులో మనిషి మనిషికి మధ్య చోటులేనంత కిక్కిరి ప్రయాణాలు సాగిస్తుండడంతో ప్రమాదం జరిగితే పెద్ద ఎత్తున ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది. ప్రయాణికుల బరువుతో బస్సులు మలుపుల వద్ద ఒకపక్కకు వంగిపోతున్నాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ, ఆర్‌టీఏ అధికారులు కిక్కిరిసిన బస్సు ప్రయాణాలపై దృష్టిసారించి ప్రయాణికుల ప్రాణాలకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

• త్వరలో ఆర్టీసీకి నూతన బస్సులు

ఆర్టీసీకి నూతన బస్సులు లేక చాలా సంవత్సరాలు అవుతుంది. ఉన్న బస్సులతోనే ఆర్టీసీని నెట్టుకొస్తున్నారు. నూతన బస్సులు వచ్చినా ఆ బస్సులు రిప్లేస్‌మెంట్‌లోనే వచ్చాయి. నూతనంగా బస్సులను మాత్రం ప్రవేశపెట్టలేదు. బస్సులలో ప్రయాణికుల రద్దీ ఎక్కువ కావడంతో రీజియన్ వ్యాప్తంగా మరో 60నుంచి 70 బస్సులను తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే రీజియన్ ఆర్టీసీ అధికారులు ప్రపోజల్‌ను ఉన్నతాధికారులకు పంపారు. ముఖ్యంగా రద్దీగా ఉండే వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిర్మల్ తదితర ప్రాంతాలకు 6 నుంచి 7 బస్సులను అదనంగా నడపనున్నట్లు తెలుస్తోంది. ఆర్టీసీ యాజమాన్యం ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని కొత్త బస్సులను త్వరగా ఏర్పాటు చేయాని ప్రయాణికులు కోరుతున్నారు.

రద్దీకి అనుగుణంగా బస్సులు

• జానీరెడ్డి, ఆర్టీసీ ఆర్.ఎం.



బస్సులలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేస్తున్నాం. తొందరలోనే నూతన బస్సులను ప్రవేశపెట్టేందుకు ఆర్టీసీ ఉన్నతాధికారులకు ప్రపోజల్‌ను పంపించాం. జరిగిందింది. నూతన బస్సుల రాకతో ప్రయాణికుల రద్దీకి కొద్దిమేర ఫుల్‌స్టాప్ పెట్టేలా అవకాశం ఉంది.

ప్రయాణికులను పరిమితికి మించి తరలించొద్దు

• జె.ఉమామహేశ్వర్‌రావు, డీటీవో



ప్రభుత్వ, ప్రైవేట్ వాహనాలు పరిధికి మించి ప్రయాణికులను తరలించవద్దు. మితిమీరిన ప్రయాణికులతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వాహనాల పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు తీసుకుంటాం. ప్రతీఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటించాలి.

ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

• నోడల్ అధికారులతో సమావేశమైన రిటర్నింగ్ అధికారి, పరిశీలకులు



ఎంసీఎంసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పరిశీలకులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 27: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి ఎన్నికల నిర్వహణ కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా పకడ్బందీ చర్యలు చేపట్టామని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. ఎన్నికల కోసం జిల్లాకు నియమితులైన ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలీజ్‌వజ్ ఆర్, వ్యయ పరిశీలకులు డీఎం నెమ్మి, పోలీసు శాఖకు సంబంధించిన పరిశీలకులు రాజేష్ మీనాలు శనివారం జిల్లా కార్యాలయాల సముదాయాల సమావేశ మందిరంలో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నిజామాబాద్, జగిత్యాల జిల్లా కలెక్టర్లు, జిల్లా ఉన్నతాధికారులు, నోడల్ అధికారులతో సమావేశమయ్యారు. పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఎన్నికల నియమావళి అమలు, పోలింగ్, కౌంటింగ్ నిర్వహణకు చేపట్టాల్సిన చర్యల గురించి రిటర్నింగ్ అధికారి పరిశీలకులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని బోధన్, నిజామాబాద్, అర్బన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బాల్కొండ, జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాలున్నాయని మొత్తం 17లక్షల 4వేల 867 మంది ఓటర్లుండగా 944 ప్రాంతాల్లో 1808 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. నిజామాబాద్‌లో 1288,జగిత్యాల జిల్లాలో 516 పోలింగ్ కేంద్రాలున్నాయని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 1.22 కోట్ల నగదు, 1.28 కోట్ల విలువైన బంగారు సీజ్ చేసినట్లు తెలిపారు. ఎంసీఎంసీ కేంద్రాన్ని జిల్లా కలెక్టరేట్‌లో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సెంటర్‌ను సందర్శించారు.

ఇసుక టిప్పర్ల మధ్య రవాణాపై వివాదం

బోధన్ రూరల్, ఏప్రిల్ 27: ఇసుక టిప్పర్ల రవాణా మధ్య వివాదం చోటు చేసుకోవడంతో ఇరు వర్గాలు పరస్పరం దాడులు చేసు కున్న ఘటన చోటు చేసుకుంది. పట్టణంలోని బాబా గార్డెన్ వద్ద శని వారం అర్బాస్‌ఖాన్, జహీర్, ఇంతియాజ్ ఇసుక టిప్పర్ నడిపిస్తుండగా యూసుఫ్, ఇమ్రాన్‌లతో పాటు మరికొందరు మీరెలా ఇసుక నడిపిస్తారని ఒకరి ఒకరు పరస్పరం దూషించు కోవడంతో పరస్పర దాడులకు దారితీసింది. ఈ ఘటనలో అర్బాస్‌ఖాన్, జహీర్‌లకు తీవ్ర గాయాలు కావడంతో దాడిచేసిన వారిపై కేసులు నమోదు చేశామని పట్టణ సీఐ వీరయ్య తెలిపారు.

రేణుక ఎల్లమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 27: కమ్మర్‌పల్లి శ్రీగిరిగుట్టపై కొలువుదీరిన గౌడ కులస్థుల ఆరాధ్య దైవం రేణుక ఎల్లమ్మను ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి శనివారం దర్శించుకున్నారు. కాగా ఆలయ ఐదవ వార్షికోత్స వేడుక లు రెండో రోజూ కొనసాగాయి. ఆలయ పూజారులు, గ్రామ గౌడసంఘం సభ్యులు, యువజన సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఎమ్మెల్యే అన్నసత్రంలో పాల్గొన్నారు.

'కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం'


బోధన్‌లో ఇంటింటికీ కాంగ్రెస్ ప్రచారం దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్27: తెలంగాణ రాష్ట్రంలో మాదిరిగానే దేశంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్‌లు అన్నారు. శనివారం బోధన్ పట్టణంలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇంటింటికి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేస్తుందని అలాగే కేంద్రంలో అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలవుతాయన్నారు. నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి జీవన్ రెడ్డికి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. రాకాసిపేట్‌తో పాటు పలువార్డులలో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ హరికాంత్ చారి, దొడ్ల రవీందర్ రెడ్డి, ప్రమోద్, చిన్న, విష్ణువర్ధన్ రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు ప్రభాకర్, దాము, డబ్బు, చిరంజీవి, గ్యాస్ ఆదినారాయణ, సంగ్రామ్, ఇంద్రకిరణ్, మయూర్‌లతో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులున్నారు.

చందూర్‌లో కాంగ్రెస్ శ్రేణుల మధ్య వాగ్వాదం

వర్నిఏప్రిల్27: చందూర్ మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ శ్రేణుల మధ్య వాగ్వాదం నెలకొంది. బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కమిటీ ఎన్నికల కోసం సమావేశం ఏర్పాటు చేయగా జడ్పీటీసీ అంబర్ సింగ్ అభ్యంతరం తెలుపుతూ వాగ్వాదానికి దిగారు. పీసీసీ ఆదేశాలు లేకుండా కొత్త కమిటీలను ఎలా నియమిస్తారని పాత కమిటీలనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. మండలంలో ఏ పార్టీ సమావేశం ఏర్పాటు చేసిన జడ్పీటీసీ స్థాయి హోదాలో ఉన్న తనకు కూడా సమాచారం ఇవ్వడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీని నమ్ముకుని మండలంలో గుర్తింపు తెస్తే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే తాను ఊరుకునే ప్రసక్తే లేదని ఏనుగు రవీందర్ రెడ్డిపై ఆయన మండిపడ్డారు. ఏ నిర్ణయం తీసుకున్న పీసీసీ ఆదేశాల మేరకే కొనసాగాలి తప్ప వ్యక్తిగత నిర్ణయంతో తీసుకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని జడ్పీటీసీ హెచ్చరించారు. దీంతో ఏనుగు రవీందర్ రెడ్డి, జడ్పీటీసీ అంబర్ సింగ్ వర్గాల మధ్య కొద్దిసేపు తోపులాట జరిగింది. ఇరువర్గాలను సీనియర్ నాయకులు సముదాయించారు.

జానకంపేటలో యువతి అదృశ్యం

ఎడపల్లి, ఏప్రిల్ 27: ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామానికి చెందిన చిక్కెల సహస్ర (19) అనే అమ్మాయి అదృశ్యమైనట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 27వ తేదీన ఉదయం ఆరు గంటలనుండి సహస్ర అనే యువతి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో వెతికిన, బంధువలను ఫోనులో విచారించగా ఆచూకి తెలియక పోవడంతో యువతి అన్న సంజీవ్ ఎడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని, అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రిజిస్ట్రేషన్ చేయాలా.. డబ్బులు ఇవ్వాల్సిందే

● ఇదీ కొందరు తహసీల్దార్‌ల తీరు ● తమకు తెలియకుండా స్లాట్ బుక్ చేయొద్దంటూ.. మీ-సేవ నిర్వాహకులపై ఆగ్రహం



ఆలూర్ తహసీల్దార్ కార్యాలయం

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్27: గతంలో వ్యవసాయ భూముల పనుల రిజిస్ట్రేషన్ చేయాలంటే రైతులకు నానా ఇబ్బందులు తలెత్తేవి. అధికారులకు చేతులు తడపందే పనులు ముందుకు సాగేవికావు. ఇటీవల ప్రభుత్వం ఆన్‌లైన్ విదానంలో స్లాట్ బుకింగ్ ద్వారా భూముల రిజిస్ట్రేషన్ చేయడానికి అవకాశం కల్పించింది. దీంతో తమ భూముల రిజిస్ట్రేషన్ సునాయసంగా జరుగుతాయని ప్రజలు సంతోషించారు. కానీ ఇందుకు కొందరు అధికారులు ససేమిరా అంటూ అడ్డుపడుతున్నారు. ఇటీవల ప్రభుత్వం ఆలూర్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేసింది. గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యం నిమిత్తం కొత్త మండలాన్ని ఆయా గ్రామాలకు అందుబాటులో ఉండేలా చేసింది. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న అధికారి చేతులు తడపనిదే పనులు చేయడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల దేగాం గ్రామానికి చెందిన గడ్డం శ్రీనివాస్‌రెడ్డి వారసత్వంగా వచ్చిన భూమిని తన భార్య పేరు మీద గిఫ్ట్ డీడీ చేయించడానికి ఈనెల 20నస్లాట్ బుక్ చేసుకున్నాడు. తన స్లాట్ బుకింగ్ విషయమై తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఓఅధికారిని అడుగగా మీరు స్లాట్ బుకింగ్ ఎలా చేసుకున్నారని కోపంతో ప్రశ్నించినట్లు బాధితుడు పేర్కొన్నారు. చివరికి సదరు అధికారికి ఎంతో కొంత ముట్టజెప్పి పనిపూర్తి చేసుకున్నట్లు తెలిసింది.

● రిజిస్ట్రేషన్‌కు ఇబ్బందులు

వ్యవసాయ భూములకు సంబంధించి ధరణిలో రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. దూర ప్రాంతాల్లో ఉండేవారు వారి భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి స్లాట్ బుక్ చేసుకుందామని మీ సేవ కేంద్రాలను సంప్రదిస్తే ముందుగా తహసీల్దార్‌ను కలువాలని మీ సేవ నిర్వాహకులు చెబుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. తమను సంప్రదించకుండా ఎవరికి ఏలాంటి స్లాట్‌లు బుక్ చేయవద్దని తహసీల్దార్ సంబంధిత మీ సేవ నిర్వాహకులకు హుకుం జారీ చేసినట్లు సమాచారం. దీంతో రిజిస్ట్రేషన్ చేయించుకోవానికి జాప్యం జరుగుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈవిషయమై తహసీల్దార్‌ను కలిస్తే తమకుఇప్పుడు తీరికలేదని అంటు న్నారని బాధితులు అంటున్నారు. అధికారులకు డబ్బులు ముట్టజెబితేనే రిజిస్ట్రేషన్ పనులు పూర్తవుతున్నాయని బాధితులు వాపోతున్నారు.

రిజిస్ట్రేషన్‌కు ఇబ్బందులు

తమ కుటుంబసభ్యులకు సంబంధించిన భూముని ధరణిలో రిజిస్ట్రేషన్ చేయించు కోవడానికి ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. సంబంధిత మీ సేవ కేంద్రంలో స్లాట్ బుక్ చేయడానికి సంప్రదిస్తే తహసీల్దార్ చెబితేనే స్లాట్ బుక్ చేసుకుంటామని అంటున్నారు. చదువుకున్నవారు విద్య వంతుల పరిస్థితి ఇలా ఉంటే నిరక్షరాస్యులైన గ్రా మీణ ప్రాంత ప్రజలకు ఎంత ఇబ్బంది కలు గుతుందో చెప్పాలేం. సంబంధిత అధి కారులు ఈ విషయంపై దృష్టి సారించి ప్రజల ఇబ్బందులను దూరం చే యాలి.

- గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఆర్ఐ, (దేగాం)

ఉపాధి పని ప్రాంతంలో రాగి నాణేలు లభ్యం


అడ్కాస్‌పల్లిలో దొరికిన రాగి నాణేలు

కోటగిరి,ఏప్రిల్27: ఉపాధి పని ప్రాంతంలో కూలీలు పని చేస్తుండగా ఓ మట్టి కుండ బయటపడింది. కూలీలు కుండను ధ్వంసం చేశారు. ధ్వంసమైన కుండలో నాణేలు బయటపడడంతో బంగారు నాణేలుగా భావించి దొరికిన దొరికినట్లుగా కూలీలు ఎగబడి ఎత్తుకెళ్లారు. తీరా ఇంటికి వెళ్లి చూశాక రాగి నాణేలు ఉండడంతో అవాక్కైన సంఘటన కోటగిరి మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని అడ్కాస్‌పల్లి గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు శనివారం అటవీప్రాంతంలో కూలీ పనులకు వెళ్లారు. సాగర్ కాలువ సమీపంలో ఓ దర్గా వద్ద పూడిక పనులు చేపట్టారు. ఫైమద్‌బీ అనే ఉపాధి కూలీ పని చేస్తుండగా మట్టి కుండ బయటపడింది. ఇది గమనించిన కూలీలు కుండను పగులగొట్టారు. కుండలో ఉన్న నాణేలను పోటీ పడి ఇంటికి ఎత్తుకువెళ్లారు. మరికొందరు బంగారు నాణేలు లభ్యమయ్యాయని భావించారు. ఈ విషయం గ్రామంలో దవణంగా వ్యాపించింది. స్థానికులు వెంటనే పోలీసులు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. కోటగిరి తహసీల్దార్ సునీత, రుద్రూర్ సీఐ జయేష్ రెడ్డిలు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఉపాధి కూలీలను పిలిపించి నాణేలను స్వాధీనం చేసుకున్నారు. సుమారు 30కి పైగా నాణేలను స్వాధీనం చేసుకుని ట్రెజరీ కార్యాలయానికి తరలించారు. మిగిలిన నాణేలను కూలీల వద్ద నుండి స్వాధీనం చేసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. కూలీలు సైతం నాణేలను తిరిగి ఇవ్వాలని లేనిపక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సయ్యద్ హుస్సేన్, ఏఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి యాదు, ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్ తదితరులున్నారు.

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు


జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం


బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న పట్టణ అధ్యక్షుడు నరేందర్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 27: కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితు ల్లో లేరని, తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ సాధిస్తే ప్రస్తుతం దొంగల రాజ్యం పాలన సాగుతోందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జీవన్ రెడ్డి, నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యా లయంలో శనివారం బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను అధ్యక్షులు జీవన్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధన కోసం కేసీ ఆర్ అమరుడు కావడానికి సిద్ధమయ్యాడని, తెలంగాణ నిర్మాణా నం తరం తొమ్మిదేళ్లుగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథ కాల ను ప్రవేశ పెట్టి దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉంచారని అ న్నా రు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ప్రజలు మళ్లీ మార్పు కోరుకుంటున్నారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో నీళ్ల లేక పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే పట్టించు కునే నాథుడే కరువయ్యాడన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిజా మాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను నియమించడం శుభ సూచకమన్నారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధిస్తే ప్రస్తుతం దొంగలు రాజ్యాన్ని ఏలుతున్నారన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజ లను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మహిళలకు ఫ్రీ బస్సు తప్ప ఏమీ చేయలేదన్నారు. రైతుబంధు, రుణమాఫీ, కల్యా ణలక్ష్మి, రైతుబోనస్ ఇవ్వడానికి చేతకాదు కాని కేసీఆర్ పై లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. గ్రామాల్లో కేసీఆర్‌ను ఎందుకు ఓడగొట్టా మని ప్రజలు బాధపడుతున్నారన్నారు. మళ్లీ సారే రావాలి, కారు కావాలని అంటున్నారన్నారు. ఏ లక్ష్యానికి తమ పార్టీ ఆవిర్భవించిందో ఆ లక్ష్యాలను ఒక్కొక్కటిగా గుర్తుచేసుకుంటు తెలంగాణలో ఏ ఒక్కరికి సమస్యలు లేకుండా చేయాలనే లక్ష్యంతో పనిచేస్తుందన్నారు. ప్రజల్లో మార్పు మొదలైందని ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బాజిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ దండు నీ తూకిరణ్, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్యప్రకాష్, మాజీ నూడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సిర్ప రాజు, ఎనగందుల మురళి, కరిపెరాజు, తదితరులు పాల్గొన్నారు.

● పార్టీ కార్యాలయంలో జీవన్‌రెడ్డి వర్సెస్ దాదన్న రగడ

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల అనంతరం కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, జడ్పీ చైర్మన్ దాదన్నగిరి విఠల్ రావు మధ్య గొడవ జరిగినట్లు తెలిసింది. పార్టీ కార్యక్రమాలకు తనను పిలవడం లేదంటు విఠల్‌రావు జీవన్ రెడ్డిని నిలదీసినట్లు తెలిసింది. కనీసం సమాచారం ఇవ్వకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సమాచారం ఇచ్చే సమయంలో తన పేరును రాయడం లేదంటు గొడవ దిగినట్లు తెలిసింది. దీనికి జీవన్ రెడ్డి గట్టిగానే బదులిచ్చినట్లు సమాచారం.

● బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. 2001 ఏప్రిల్‌లో ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్ర సమితి రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమాలు, పోరాటాలు, త్యాగలు చేసి తెలంగాణను సాధించుకున్నామని, ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ అంటే ఒక భరోసా అని అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ నాయకత్వంలో తక్కువ సమయంలో రాష్ట్రాన్ని అభివృద్ధిని చేసి చూపించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మెట్టు సంతోష్, మాజీ సర్వసమాజ్ అధ్యక్షుడు సుంకరి రవి, బీఆర్ఎస్ నాయకులు నర్మే నవీన్, దోండి శ్యామ్, రాజబాబు, మీర శ్రావణ్, జన్నెపల్లి రంజిత్, అగ్గు క్రాంతి, సాహిద్, లతిప్, హర్షద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యవాదులు కలిసి రావాలి

పెద్దబజార్, ఏప్రిల్ 27: బీజేపీ, ఆర్ఎస్ఎస్, ఎన్డీయే శక్తులను ఓడించడంలో అన్ని వర్గాల ప్రజలు ప్రగతిశీల శక్తులు, ప్రజాస్వామ్యవాదులు కలిసి రావాలని తెలంగాణా సోషల్ డెమోక్రటిక్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ వినయ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని ప్రగతినగర్‌లో గల మున్నూరుకాపు కల్యాణమండపంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచారంలో మత విద్వేశాల రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. తన ప్రభుత్వం పదేళ్లకాలంలో చేసిన అభివృద్ధి శూన్యం కాబట్టే మతోన్మాదాన్ని ప్రచారంగా మార్చుకున్నారని అన్నారు. భారత జాతీయ వాదుల ఉద్యమం కన్వీనర్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను పాటిస్తూ ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. విద్య, వైద్య రంగాలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే ప్రయత్నాలు చేస్తోందన్నారు. గత పదేళ్లుగా దేశ సంపదను ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. నిరుద్యోగ రేటును విపరీతంగా పెరిగిందన్నారు. తద్వార కార్పొరేట్ల ఆదాయం 30శాతం వృద్ధిచెందగా పేద మధ్య తరగతి ప్రజల ఆదాయం 11శాతం పడిపోయిందన్నారు. బీజేపి ప్రభుత్వం హయాంలోనే ధరలు 30శాతం నుంచి 56శాతానికి పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు రిటైర్డ్ న్యాయాధికారి చంద్రకుమార్, జాతీయ నాయకులు రాయల చంద్రశేఖర్, చలపతిరావ్, సర్దార్‌భక్తవార్‌సింగ్, గోవర్దన్, వనమాల కృష్ణ, ఆకుల పాపయ్య, శ్రీనివాస్, వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు వి.ప్రభాకర్, నరేందర్, దాసు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌రెడ్డి

నిజామాబాద్ ఎంపీగా జీవన్‌రెడ్డిని గెలిపించాలి

● మాజీఎమ్మెల్సీ బి.మోహన్‌రెడ్డి


ఆర్మూర్‌లో మాట్లాడుతున్న మాజీఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్27: నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా జీవన్‌రెడ్డిని గెలిపించాలని మాజీఎమ్మెల్సీ బి.మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పీవీఆర్ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగుల, పెన్షనర్‌లకు అనేక సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారం కావాలంటే జీవన్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పింఛన్‌దారులకు 5వ తేదీన వేతనాలు అందుతున్నాయన్నారు. ఎంపీ ఎన్నికల తర్వాత కూడా వేతనాలు సకాలంలోనే అందుతాయన్నారు. జీవన్‌రెడ్డి ఎంపీగా గెలువగానే ఉద్యోగుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.సమస్యలపై పోరాడే వ్యక్తి టి.జీవన్‌రెడ్డిని పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలి పించాలని మాజీఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి కోరారు. ఈసమావేశంలో విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

యంచ చెక్‌పోస్టు పరిశీలన


యంచ చెక్‌పోస్ట్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు

నవీపేట,ఏప్రిల్27: మండలంలోని యంచ చెక్‌పోస్టును ఎన్నికల వ్యయ పరిశీలకులు డీఎం.నేమ్మి శనివారం పరిశీలించారు. పొరుగున ఉన్న నిర్మల్ జిల్లాతో పాటు మహరాష్ట్ర నుండి అక్రమంగా మద్యం, నగదు సరఫరా కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికలు దగ్గర పడుతున్నందున అక్రమంగా మద్యం, నగదు సరఫరా జరిగే అవకాశం ఉందని ఈ విషయంపై నిఘాను మరింతగా పెంచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల వ్యయ కమిటీ నోడల్ అధికారి పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాల పరామర్శ

ఎడపల్లి, ఏప్రిల్ 27: ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామ మాజీ సర్పంచ్ బండారి దశరథ్, రిటైర్డ్ ఎస్సై గద్ద సాయిలు, ఎంబ గంగాధర్ కుటుంబాలను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు రజితా యాదవ్, జైతాపూర్ సహకార సంఘం అధ్యక్షులు సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు పులి శ్రీనివాస్, విజయ్ కుమార్ గౌడ్, రాధా కిషన్ గౌడ్, లింగం, మోహన్, కిషోర్, నవీన్ తదితరులు ఉన్నారు.

తొర్లికొండలో వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు


వేంకటేశ్వరస్వామి నిర్మాణానికి విరాళాలు అందజేస్తున్న భక్తులు, గ్రామస్థులు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్27: మండలంలోని తొర్లికొండ గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. శనివారం తెల్లవారు జాము నుంచి భక్తులు కొండపై చేరుకొని స్వామివారి పల్లకిని కొండ చుట్టు ప్రదక్షిణ చేయించారు. అనంతరం ఆలయంలో భక్తులు, గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. కొండపై నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం నిర్మాణానికి భక్తులు, గ్రామస్థులు విరాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మానవ జన్మను ప్రజలు సార్థకం చేసుకోవాలి

బోధన్‌రూరల్,ఏప్రిల్27: ప్రజలు మానవ జన్మను సార్థకం చేసుకోవాలని శ్రీ బ్రహ్మ శివాచార్య స్వామిజీలు అన్నారు. శనివారం పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో అఖండ శివనామ సప్తాహ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హజరైన ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రవచనలు చేశారు. సృష్టిలో మానవ జన్మ కర్మ ఫలాల ఫలితంగా వస్తుందని దీనిని సార్థకం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు శివనామ స్మరణ చేస్తే సకల శుభాలు కలుగుతాయని, క్రోదినామ సంవత్సరంలో ప్రజలు ఓపిక, సహనంతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజ్ ప్రతినిధులు పురాణే అజయ్‌కుమార్, గంగాదరప్ప, నర్సింగప్ప, శంకరప్ప, విఠలప్ప, రాజేందర్ అప్ప, బాబయప్ప, శివకుమార్, పురాణే దిలీప్ కుమార్, శివ, రవి పటేల్, గణపతి అప్ప, వీరశైవ భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గోదావరిఖనిలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్

● నాలుగు రోజుల పాటు నిర్వహణ


క్రీడల జెండావిష్కరణ చేస్తున్న రాజేశ్వర్‌రావు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 27: రాష్ట్ర స్థాయి సీనియర్ ఇంటర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో శనివారం ప్రారంభమైంది. స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో కరీంనగర్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమైన ఈ టోర్నమెంట్ నాలుగు రోజుల పాటు జరుగనున్నది. ఈ టోర్నమెంట్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల జట్లు పాల్గొనున్నాయి. 10వ సీనియర్ ఇంటర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ చాంపియన్‌షిప్‌ను సింగరేణి ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, క్రీడలు శరీర ధారుడ్యాన్ని పెంచడంతో పాటు ధారుడ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడాకారులకు సింగరేణి వసతి సౌకర్యం కల్పించింది. తొలిరోజు జరిగిన మ్యాచ్‌ల్లో నిజామాబాద్, వరంగల్ జట్లు తొలి మ్యాచ్‌లో పోటీ పడగా నిజామాబాద్ జట్టు విజయం సాధించింది. రెండవ మ్యాచ్‌లో వనపర్తి, ఖమ్మం జట్ల మధ్య జరిగిన పోటీల్లో వనపర్తి జట్టు విజయం సాధించింది. మూడవ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జట్ల మధ్య మ్యాచ్ జరుగగా డ్రాగా ముగిసింది. 5వ మ్యాచ్ రంగారెడ్డి, మెదక్ జట్లు మధ్య జరిగిన మ్యాచ్‌లో రంగారెడ్డి జట్టు విజయం సాధించింది. 6వ మ్యాచ్‌లో వరంగల్, కరీంనగర్ జట్లు తలపడగా కరీంనగర్ జట్టు విజయం సాధించింది. 7వ మ్యాచ్ నల్గొండ, ఖమ్మం జట్ల మధ్య జరిగిన పోటీల్లో నల్గొండ జట్టు గెలుపొందింది. ఈ టోర్నమెంట్‌లో కరీంనగర్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గణపతి, వైస్ ప్రెసిడెంట్ ఆర్పి నాయుడు, కోశాధికారి సామాల సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ విజయ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేష్‌తో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

బాల్కొండ కస్తూర్బా విద్యార్థులకు అభినందన



విద్యార్థినులను సన్మానిస్తున్న డీఈవో దుర్గాప్రసాద్

ముప్కాల్, ఏప్రిల్27: ఇంటర్ ఫలితాల్లో స్టేట్ ర్యాంకు సాధించిన జిల్లాలో మొదటి ర్యాంకు సాధించిన బాల్కొండ కస్తూర్బా విద్యార్థినులను శనివారం డీఈవో దుర్గాప్రసాద్ ఘనంగా సన్మానించారు. రాష్ట్ర స్థాయి ఆరవ ర్యాంకు, జిల్లాస్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన మొదటి సంవత్సరం సీఈసీలో 470మార్కులు సాధించిన డి.రితిషను, ఎంపీహెచ్‌డబ్ల్యు గ్రూప్‌కు 966 మార్కులు సాధించి రాష్ట్రంలో 19వ ర్యాంకు, జిల్లాలో మొదటి ర్యాంకు సాధించిన సీహెచ్.వైష్ణవితో పాటు ఎంపీహెచ్‌డబ్ల్యు రెండో సంవత్సరంలో నలుగురు విద్యార్థులు 90శాతం మార్కులు సాధించారు. మొదటి సంవత్స రం శాతం సాధించిన 13మంది విద్యార్థులు డీఈవో దుర్గాప్రసాద్ శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ భవిష్యత్‌లో ఉన్నత స్థానాలు అధిరోహించాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను డీఈవో అభినందించారు. ఈకార్యక్రమంలో బాల్కొండ కస్తూర్బా పాఠశాల స్పెషల్ ఆఫీసర్‌భవాని, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటిపై వ్యక్తి దాడి.. ఫర్నిచర్ ధ్వంసం

ఖిల్లా , ఏప్రిల్ 27: తమ్ముడి భార్య కుటుంబసభ్యుల ఇంటిపై దాడి చేసి ఇంటికి నిప్పుపెట్టి ఇంట్లోని విలువైన వస్తువులను ధ్వంసం చేసిన కేసులో అన్న మజహర్‌పై కేసునమోదు చేసినట్లు ఐదో టౌన్ పోలీసు స్టేషన్ ఎస్ఐ. అశోక్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని శాంతినగర్‌కు చెందిన అమర్, మజహర్ అన్నదమ్ములు, వీరిద్దరి కంటే మరో ఇద్దరు పెద్దవారు ఉన్నారు. ప్లంబర్ పని చేసే అమర్‌కు ఏడాది క్రితం హైదరాబాద్‌కు చెందిన యువతీతో నిశ్చితార్థం జరిగింది. పేదింటి యువతీ అయినప్పటికీ ఆమెనే పెళ్లాడుతానని అమర్ అన్న మజహర్‌తో చెప్పాడు. మజహర్‌కు ఈ పెళ్లి ఇష్టం లేకపోవడంతో పెళ్లికి అడ్డు పడుతూ వచ్చాడు. శుక్రవారం అమర్ తనతో జరిగిన నిశ్చితార్థం జరిగిన యువతీని ఎడపల్లిలో ఖాజీ వద్దకు వెళ్లి సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న అన్న మజహర్ తన అనుచరులతో కలిసి నవదంపతులపై దాడికి ప్రయత్నించారు. అనంతరం నూతన దంపతులు తమకు రక్షణగా ఉండే అమ్మమ్మ ఇంటి వద్దకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న మజహర్ అతని అనుచరులు యువతీ అమ్మమ్మ మౌలిబేగం ఇంటిపై దాడి చేసి బీభత్సం సృష్టించారు. ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. అమర్ అతను పెళ్లి చేసుకున్న యువతీ పక్క గదిలో ఉండడంతో ప్రమాదం తప్పింది, ఈ సంఘటనలో పెళ్లిలో ఇచ్చిన కట్నం కానుకలు అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని బాధితుల ఫిర్యాదు మేరకు మజహర్‌పై కేసునమోదు చేశారు.

'మహిళా సంఘాల సభ్యులకు రూ.10లక్షల రుణాలు'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

సిరికొండ ఏప్రిల్ 27: మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి ఒక్కొక్క మహిళ సంఘానికి రూ. పదిలక్షల చొప్పున రుణాలు ఇస్తామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రకటించారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండలంలోని చీమన్‌పల్లి, పందిమడుగు, పాకాల, తూంపల్లి, కొండపూర్, హున్సగర్ గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రచారం చేశారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఓటేసి కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. మహిళలు ఆర్థిక స్వావలంబన పొందాలంటే ఆర్థికంగా ప్రభుత్వ ఆదుకుంటుందన్నారు.మహిళ సంఘానికి పది లక్షల చొప్పున పావల వడ్డీకే రుణాలు ఇప్పిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాలుగు, ఐదు నెలల్లోనే ఐదు గ్యారంటీలను అమలు చేసిన ఘనత మాదేనన్నారు. కార్యక్రమంలో సిరికొండ జడ్‌పీటీసీ సభ్యులు మాన్‌సింగ్, పీఏసీఎస్ అధ్యక్షులు చెల్లెం గంగాధర్, రాములు నాయక్, ఎంపీటీసీ సభ్యులు లింగం, సెంతీయ, నాయకులు ఎర్రన్న, బాస్కర్‌రెడ్డి,బాల్‌రాజు నాయక్, నర్సింగ్, నర్సారెడ్డి ముప్ప గంగారెడ్డి,లక్ష్మణ్,వినోద్,బీమయ్య, సంతోష్, చిన్నబాల్‌రాజు, చెలిమెల నర్సయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన జింక పిల్ల అప్పగింత



జింక పిల్లను అప్పగిస్తున్న రైతు


రెంజల్,ఏప్రిల్27: మండలంలోని నీలా గ్రామానికి చెందిన రైతు గంగాధర్ పొలంలో కుక్కల దాడిలో గాయపడిన జింక పిల్ల కనిపించడంతో శనివారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సుధాకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శనివారం ఉదయం పంట పొలానికి వెళ్లడంతో అక్కడ గాయపడిన జింక పిల్ల కనిపించడంతో స్థానిక ఫారెస్టు అధికారులకు సమాచారం అందించగా.. సంఘటన స్థలానికి చేరుకున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సుధాకర్‌కు జింక పిల్లను అప్పగించారు. వైద్య పరీక్షలు నిర్వహిస్తామని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు గంగాకృష్ణ, శివ పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్27: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో రక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ప్రయాణికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎండలో విపరీతంగా ఉండడంతో ప్రజలకు వడదెబ్బ లాంటివి తగలకుండా ఆర్మూర్, పెర్కిట్ బస్టాండ్‌లతో పాటు మామిడిపల్లి చౌరస్తాలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసినట్లు రక్ష స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఖాందేశ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాప్రవీన్, జిందం నరహరి,తదితరులు పాల్గొన్నారు.

అర్వింద్ నిర్లక్ష్యం వల్లే చక్కెర ఫ్యాక్టరీలు పునఃప్రారంభం కాలేదు

- కాంగ్రెస్ రైతుల పక్షపాతి : కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి



ఏర్గట్లలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి.. పక్కన సుదర్శన్ రెడ్డి, ముత్యాల సునీల్ కుమార్

మోర్తాడ్, ఏప్రిల్ 27 : ఎంపీ ధర్మపురి అర్వింద్ నిర్లక్ష్యం వల్లనే చక్కెర ఫ్యాక్టరీలు పున: ప్రారంభం కాలేదని పసుపుబోర్డు ప్రకటనలే పరిమితమైందని నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం మోర్తాడ్‌లోని ప్రజాభవనంలో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో టి.జీవన్‌రెడ్డి మాట్లాడారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో గతంలో కవితకు ఎలాంటి వ్యతిరేకత వచ్చిందో.. ఈనాడు అర్వింద్‌పై అంతకంటే ఎక్కువ వ్యతిరేకత ప్రజల్లో ఉందని జీవన్‌రెడ్డి ఆరోపించారు. ఎంపీ అర్వింద్ పసుపుబోర్డు, చక్కెర కర్మాగారాలపై ప్రజలకు ఇచ్చిన హామీల వల్లనే ఆయన గెలుపొందారని అన్నారు. రైతులకు జీవన్‌రెడ్డి ఏం చేశారని అర్వింద్ ప్రశ్నించడంతో ఆయన స్పందిస్తూ.. అర్వింద్ జగిత్యాల్‌కు వచ్చి చూడాలని, అభివృద్ధి కనబడుతుందని అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై తాను స్పందించి పని చేశానన్నారు. తాను గెలిస్తే ఇండియా కూటమి ఆధ్వర్యంలో చక్కెర కార్మాగారాలు తెరిపిస్తానని అన్నారు. అర్వింద్ పార్లమెంట్ పరిధిలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని అన్నారు. ఎర్రజొన్నలకు మద్దతు ధర ఏమైందని ప్రశ్నించారు. దేశంలో 66చక్కెర ఫ్యాక్టరీలు ప్రారంభమయ్యాయని చెబుతున్న అర్వింద్.. నిజామాబాద్ పరిధిలో చక్కెర ఫ్యాక్టరీలను ఎందుకు పున: ప్రారంభించ లేదని ధ్వజమెత్తారు. ఉపాధి హామీ పథకాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిందని, ఆ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తుందని జీవన్‌రెడ్డి ఆరోపించారు. . రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఉనికి కోల్పోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉన్నందున తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను త్వరలో అమలు చేస్తామని జీవన్‌రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, జీవన్‌రెడ్డి అనుచరలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఏర్గట్ల: రైతుల పక్షపాతి కాంగ్రెస్ పార్టీయేనని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి చూపించిందన్నారు. రాష్ట్రంలో ఉన్నట్లే కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటే మరింత అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. రైతులు పండించే ధాన్యానికి మద్దతు ధరతో పాటు ఐదు వందల రూపాయల బోనస్ అందజేస్తామని, ఆగస్టు లోపు సీఎం రేవంత్ తెలిపినట్లు రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. అలాగే రేషన్ కార్డు లేని వారికి కొత్త రేషన్ కార్డులు అందజేస్తామన్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ జీవన్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, తాహెర్ బిన్ అందాన్, అరికెల నర్సారెడ్డి, ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, ఆడెపు గంగాప్రసాద్, బద్దం లింగారెడ్డి, గడ్డం జీవన్, పన్నాల నర్సారెడ్డి, ముస్కు మోహన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముప్కాల్: రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీ పార్టీలు ఒక్కటేనని నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్‌తో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీని ఓడించి కాంగ్రెస్ పార్టీ గెలిచినట్టు దేశంలో దేశాన్ని పాలిస్తున్న బీజేపీని ఓడించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి చైర్మన్ అన్వేష్‌రెడ్డి, వేంపల్లి సొసైటీ చైర్మన్ జక్క రాజేశ్వర్, కాంగ్రెష్ పార్టీ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యంరెడ్డి, కాంగ్రెస్ నాయ కులు బుల్లెట్ రాంరెడ్డి,చిన్నారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

- కాంగ్రెస్ పార్టీలో నాగాపూర్ లిఫ్ట్ చైర్మన్ చేరిక

ముప్కాల్: బాల్కొండ మండలం నాగాపూర్ లిఫ్ట్ చైర్మన్ సరికెల చిన్నయ్య తన అనుచరులతో కలిసి సునీల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. శనివారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన చిన్నయ్యను నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నానన్నారు.


కమ్మర్‌పల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు నెరవేర్చేసత్తా కేవలం కాంగ్రెస్ పార్టీకే ఉందని పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి అన్నారు. శనివారం రాత్రి కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని భగత్‌సింగ్ కాలనీవద్ద నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, అరికెల నర్సారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, తిప్పిరెడ్డి శ్రీనివాస్, కార్యక్తలు పాల్గొన్నారు

హైకోర్టు ఉత్తర్వులపై కోటగిరి మార్కెట్ కమిటీ నిర్లక్ష్యం

- ధాన్యంపై తీసుకున్న రుణం చెల్లించేందుకు డీడీలు తీసిన రైతులు
- డీడీలు తీసుకోకపోవడంతో రైతుల ఆందోళన



కోటగిరి మార్కెట్ కమిటీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు



(PRESENT) THE HONOURABLE SRI JUSTICE C.V. BHASKAR REDDY
WRIT PETITION NO: 8571 OF 2024

రైతులకు అనుకూలంగా వచ్చిన కోర్టు ఉత్తర్వులు

కోటగిరి,ఏప్రిల్27: రైతులకు అండగా ఉండాల్సిన మార్కెట్ కమిటీ వారి పాలిట శాపంగా మారింది. పండించిన ధాన్యాన్ని మార్కెట్ కమిటీ గోదాంలో కొంతమంది రైతులు నిల్వ చేసుకోగా మరి కొందరు రైతుబంధు కింద రుణం పొందారు. మార్కెట్ కమిటీ గోదాంలో సుమారు 25వేల క్వింటాళ్ల ధాన్యం నిల్వ ఉంది. ధాన్యంపై రుణం తీసుకున్న రైతులు నిల్వ చేసిన మరికొందరు రైతులు తమ ధాన్యం తిరిగి ఇవ్వాలని కార్యాలయానికి వెళ్తే అధికారులు పొంతనలేని సమాధానాలు చెప్పి దాట వేస్తున్నారు. చేసేదేమీ లేక సుమారు 16మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు. 15రోజుల్లో మార్కెట్ కమిటీ నిబంధనల మేరకు ధాన్యం తిరిగి ఇవ్వాలని కోర్టు ఆదేశాలు ఇచ్చింది. కోర్టు ఆదేశాలతో వారం రోజుల నుండి మార్కెట్ కమిటీ కార్యాలయానికి రైతులు వెళితే పట్టించుకునే వారే కరువయ్యారు. రైతుబంధు కింద తీసుకున్న అప్పును డీడీలు తీసి ఇస్తే తీసుకోవడానికి అధికారులు ముందుకు రాకపోవడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. కోటగిరి మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట శనివారం జడ్పీటీసీ శంకర్ పటేల్ ఆధ్వర్యంలో రైతులు ఆందోళనకు దిగారు. కోర్టు ఉత్తర్వుల మేరకు డీడీలు చేతపట్టుకుని నిరసన తెలిపారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ నిర్లక్ష్య వైఖరిపై రైతులు తీవ్రంగా మండిపడ్డారు. తమ సమస్యను ఏ మాత్రం పట్టించుకోకుండా కార్యాలయానికి రాకుండా కార్యదర్శి తప్పించుకుంటున్నారని రైతులు ఆరోపించారు. జిల్లా అధికారులు సైతం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కోటగిరి మార్కెట్ కమిటీ గోదాంలో సుమారు 50మంది రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని గోదాములో నిల్వ చేశారు. సుమారు రెండేళ్ల నుండి గోదాములో నిల్వ చేసి ఆ ధాన్యంపై రైతుబంధు కింద రుణం పొందుతున్నారు. ఆరు నెలల వరకు వడ్డీ లేని రుణం ఆపై వడ్డీతో కూడిన రుణం చెల్లించి రైతులు తిరిగి ధాన్యం పొందే అవకాశం ఉంది. కొంతమంది రైతులు నిర్ణీత గడువు లోప తీసుకున్న రుణం చెల్లించకపోతే అధికారులు నోటీసులు జారీ చేసి రుణం రాబట్టాల్సి ఉంది. మార్కెట్ కమిటీ అధికారులు ఈ విషయమై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. గత మూడు నెలల క్రితం గోదాములో సీఎంఆర్ ధాన్యం అక్రమంగా నిల్వ చేశారని ఫిర్యాదులు రావడంతో గోదాములో ఉన్న ధాన్యం నిల్వలను ఉన్నతాధికారులు సీజ్ చేశారు. సీజ్ చేసిన ధాన్యంలో రైతులకు సంబంధించిన ధాన్యం ఉంది. ఆ ధాన్యం తిరిగి ఇవ్వాలని తీసుకున్న రుణం చెల్లిస్తామని రైతులు పదేపదే కార్యాలయం చుట్టు తిరిగామని రైతులు తెలిపారు. తాము కార్యాలయానికి వస్తే కార్యదర్శి పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. ఈ విషయమై ఈ నెల 14వ తేదిన రైతులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు మార్కెట్ కమిటీకి రైతుల సమస్యలను పరిష్కరించాలని ఉత్తర్వులు జారీ చేసింది. రైతులు తీసుకున్న రుణం తాలుకు అప్పును డీడీల రూపంలో తీసి కార్యాలయానికి వెళ్లారు. డీడీలు తీసుకోవడంలో కార్యాలయ సిబ్బంది పట్టించుకోవడం లేదని వాపోయారు. మార్కెట్ కమిటీపై నమ్మకంతో గోదాంలో ధాన్యం దాచుకుంటే తమకు ఇబ్బందులు పెట్టడం ఎంత వరకు సమంజసం అని రైతులు ప్రశ్నించారు. హైకోర్టు ఉత్తర్వులను సైతం మార్కెట్ కమిటీ అధికారులు బేఖాతర్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో మార్కెట్ కమిటీకి తాళం వేస్తామని రైతులు హెచ్చరించారు. ఆందోళన చేసిన వారిలో రైతులు హన్మంత్ రావు, ఉదయ్, నాగనాథ్, వహీద్, మనోహర్ తదితరులున్నారు.

చిన్నారిపై వీధి కుక్క దాడి

- ఘన్‌పూర్‌లో పిచ్చికుక్కల స్వైర విహారం





గాయపడిన చిన్నారి

డిచ్‌పల్లి,ఏప్రిల్ 27:మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో పిచ్చి కుక్కలు రెచ్చిపోయాయి. గ్రామంలోని చైతన్యనగర్ కాలనీలో కుర్మ పూజిత అనే చిన్నారిపై కిరాణ షాపుకి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా శనివారం మధ్యాహ్నం రోడ్డుపై ఒక్కసారి వీధికుక్కలు దాడి చేశాయి. దీంతో కిందపడి పోయిన చిన్నారని భుజానిపై , చేతి, కాళ్లపై తీవ్రం కుక్కకాట్లు వేయడంతో రక్తస్రావంతో కన్నీరు మున్నీరుగా విలపించింది. వీధి కుక్క తన కూతురు పూజను దాడి చేసి గాయపర్చడంతో తల్లి దాడి చేసిన కుక్కను తరిమివేసింది.వెంటనే108అంబులెన్స్‌లో చిన్నారిని ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో పిచ్చికుక్కలు స్వైర్వవిహారం చేస్తున్న పంచాయతీ సిబ్బంది మాత్రం పట్టించుకోవ డం లేదని కలెక్టర్ స్పందించి ఈ విషయం చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఘన్‌పూర్‌లో వీధి కుక్క నియంత్రణపై పంచాయతీ సిబ్బంది చూడన్నట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

భార్య చేతిలో భర్త హత్య

మోపాల్, ఏప్రిల్ 27: మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో న్యాల్‌కల్ గ్రామానికి చెందిన బోదాస్ లక్ష్మణ్ (35) అతని భార్య బోదాసు లక్ష్మి శనివారం తెల్లవారు జామున బండ రాయితో కొట్టి హత్యచేసిన సంఘటన గ్రామంలో చర్చనీయాంశమైంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. న్యాల్‌కల్ గ్రామంలో బోదాస్ లక్ష్మణ్‌ను భార్య లక్ష్మి నిత్యం గొడవపడేవారని గ్రామస్థులు తెలిపారు. నిత్యం మద్యం తాగివచ్చి ఇంట్లో గొడవ పడుతుండడంతో ఇది భరించలేక భర్తను హతమార్చాలన్న ఉద్దేశంతో గాఢనిద్రలో ఉన్న లక్ష్మణ్ తలపై బండరాయితో కొట్టి హత్యచేసినట్లు గ్రామస్థులు తెలిపారు. హత్య సమాచారం తెలుసుకున్న మోపాల్ ఎస్ఐ గంగాధర్ అర్ధరాత్రి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని లక్ష్మిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతు న్నట్లు తెలిపారు. రూరల్ సీఐ సురేష్ కుమార్ పోలీస్ స్టేషన్ చేరుకుని హత్యకు గల కారణాలను ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

- 24గంటల గడవక ముందే మరో భర్త హత్య

24గంటలు గడవక ముందే భార్యల చేతుల్లో ఇద్దరు భర్తలు హత్యకు గురవడంతో మండలంలో చర్చనీయాంశ మైంది. నిన్న కులాస్‌పూర్ సాయిరెడ్డిని అతని భార్య రాధ హత్య చేయగా, నేడు న్యాల్‌కల్‌లో భార్య లక్ష్మి చేతుల్లో భర్త లక్ష్మణ్ హత్యకు గురయ్యారు. ఇలాంటి ఘటనలు వరుసగా చోటుచేసుకోవడం మండలంలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మర్చంట్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ఖిల్లా , ఏప్రిల్ 27:మర్చంట్స్ అసోసియేషన్ నూతన కా ర్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం 2024నుంచి 2026వరకు కొనసాగుతారు. అధ్యక్షుడిగా కమాల్‌కిషోర్‌ఇనాన్, ప్రధానకార్యదర్శిగా జే.మల్లేష్, కోశాధికారిగా అఖిల్‌రాజ్ రాజేందర్‌లు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు ఎన్ని కల అధికారులుగా లాభిశెట్టిశ్రీనివాస్, వ్యవహరించారు. ఉదయం ఎన్నికలను నిర్వహించి అదే రోజు ఓట్ల లెక్కింపు జరిపి విజేతలను ప్రకటించారు.